ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 18 నవంబరు 2025



వాటర్‌షెడ్ పనుల్లో నిర్మించిన పర్క్యులేషన్ ట్యాంకు

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



ఆలయంలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

గుర్రంకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవాన్ని టీటీడీ వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, అభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలను చేసి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చండి

● ఖాళీ బిందెలతో మహిళల నిరసన



సబ్‌కలెక్టరేట్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కత్తివారిపల్లె మహిళలు

మదనపల్లె టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా తాగునీటి కోసం అల్లాడుతున్నాం.. అధికారులు పట్టించుకోవడం లేదంటూ కత్తివారిపల్లె మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ వద్దకు చేరుకున్న మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ కత్తివారిపల్లె మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలో 100 కుటుంబాలు నివశిస్తుండగా, రెండు నెలల క్రితం తాగునీటి బోరు ఎండిపోయిందన్నారు. అప్పటి నుంచి అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గత్యంతరం లేక రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ వారి వద్దకు వచ్చి సమస్య విన్నారు. రెండు రోజుల్లో కొత్త బోరు వేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## శ్మశానాన్నీ వదలలేదు...

● పీజీఆర్ఎస్‌లో గ్రామస్థుల ఫిర్యాదు



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన హసనాపురం ప్రజలు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాగులు, వంకలు, గుట్టలు, కొండలు అన్నీ అయిపోయాయేమో చివరికి శ్మశానాన్ని కూడా కబ్జా చేస్తున్నారని గ్రామస్థులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాపురం మండలం హసనాపురం గ్రామం కుమ్మరపల్లిలో సర్వే నెంబర్-112-2లో 26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల స్థలాన్ని శ్మశానంగా ఎప్పటి నుంచో గ్రామస్థులు వాడుకుంటున్నట్లు తెలిపారు. ఈ స్థలంపై కొంతమంది బడా బాబుల కన్ను పడి ఆ శ్మశానాన్ని కబ్జా చేసేందుకు రాత్రికి రాత్రే జేసీబీతో సమాధులను కూల్చివేశారని వారు తెలిపారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

# ఒడిసిపట్టి... అవార్డు కొట్టారు...

● దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు కేంద్ర జలశక్తి అవార్డు
● జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు
● నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న కలెక్టర్



కొండల నడుమ నిర్మించిన దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ పనుల్లో ఒక భాగం

మదనపల్లె టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాలను పెంచడంతో పాటు పంటలను సస్యశ్యామలం చేసి కేంద్ర ప్రభుత్వ అవార్డును కైవసం చేసుకుంది దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్. ప్రకృతి వనరులను ఉపయోగించుకుంటూ, భూగర్భ జలాలను పెంచుకోవడం, గ్రామాల్లో రైతుల అవసరాలకు నీటి వనరులను పెంచుకోవడం కోసం కేంద్ర జల్‌శక్తి శాఖ రూ.కోట్లలో నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులు సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలు ఇచ్చే వాటర్‌షెడ్‌లకు ప్రతి ఏటా ఇచ్చే అవార్డులో ఈసారి మదనపల్లె మండలంలోని దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు దక్కింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డును మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ నిశాంత్‌కుమార్, డ్వామా పీడీ వెంకటరత్నం అందుకోనున్నారు.

### ఏడాది ముందుగానే పనులు పూర్తి

మదనపల్లె మండల దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ పనులకు రూ.74 లక్షల నిధులు మంజూరయ్యాయి. 2026 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేయాల్సి ఉండగా గతంలో పనిచేసిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో వాటర్‌షెడ్ అధికారులు ఏడాది ముందుగానే దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ పనులు పూర్తి చేశారు. వాటర్‌షెడ్ కమిటీలోని 10 మంది రైతుల సభ్యులు, ఒక అధికారి కలిపి 11 మంది ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి, ఎక్కడెక్కడ వర్షం కురుస్తుంది? ఎక్కడ నిర్మాణాలు చేపట్టాలో సర్వే చేయించారు. వాటిని గ్రామాల్లో సభలు నిర్వహించి తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను డ్వామా పీడీ ద్వారా కలెక్టర్‌కు పంపగా, పనుల ప్రారంభానికి కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో 2022లో దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ పనుల్లో భాగంగా రూ.74 లక్షలతో రాతి కట్టడాలు, చిన్న ఊట కుంటలు, చిన్నగుంతలు, చెక్‌డ్యామ్‌లు, సర్ఫేస్ స్టోరేజి ట్యాంకులు, పర్క్యులేషన్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టారు. రైతుల పొలాల వద్ద ఆయా రైతుల పర్యవేక్షణలో వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు ఈ పనులను చేపట్టారు. ప్రాజెక్టు ఇంప్లిమెంట్ ఏజెన్సీ ఈ పనులను పరిశీలించి, ఎం-బుక్కుల ద్వారా బిల్లులు మంజూరు చేసింది.

**నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేత**

జల్‌శక్తి అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నేడు ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జల్‌శక్తి అవార్డు, ట్రోఫీతో పాటు రూ.2 లక్షల నగదు అందించనున్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్, డ్వామా పీడీ వెంకటరత్నంలు ఈ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు.

### మూడు దశల్లో జల్‌శక్తి అవార్డుకు ఎంపిక

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జల్‌శక్తి అవార్డులను పంపిణీ చేస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో నిర్వహించిన వాటర్‌షెడ్ పనులను రాష్ట్ర డ్వామా అధికారులు తొలి దశలో పరిశీలించి, నాణ్యతగా నిర్మించి, సత్ఫలితాలు ఇస్తున్న వాటర్‌షెడ్ పనుల వివరాలను కేంద్ర జల్‌శక్తి శాఖకు పంపారు. ఈ క్రమంలో రెండేళ్లుగా దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ పనుల వివరాలను పరిశీలించిన కేంద్ర జల్‌శక్తి శాఖధికారులు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి పంపారు. గత ఏడాది డిసెంబరులో కేంద్ర బృందంలోని సభ్యులు సత్యమూర్తి, సత్తార్‌బాషా దుబ్బిగానిపల్లెకు వచ్చి ఇక్కడ చేపట్టిన వాటర్‌షెడ్ పనులను పరిశీలించారు. వీరిచ్చిన నివేదికను మూడో దశలో కేంద్ర త్రిసభ్య కమిటీ పరిశీలించింది. దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ పనుల ద్వారా ఇక్కడ భూగర్భ జలాలు 400 అడుగుల లోతు నుంచి 200 అడుగుల పైకి ఎగబడ్డాయి. దీంతో ఈ వాటర్‌షెడ్‌కు దేశంలోనే ప్రథమర్యాంకు దక్కింది. ఈ మేరకు జలశక్తిశాఖ సెక్రటరీ వీఎల్ కాంతారావు ఉత్తర్వులు జారీ చేయగా ఈనెల 11వ తేదీ కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ పత్రికా ముఖంగా దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు జల్‌శక్తి అవార్డు ప్రకటించారు.



వంకకు అడ్డంగా నిర్మించిన రాతి కట్టడం

### చాలా సంతోషంగా ఉంది



కేంద్రప్రభుత్వం ఇచ్చే ఈ అవార్డు మా దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఒకప్పుడు 1000 అడుగుల లోతు బోర్లు తవ్వితేనే నీళ్లు వచ్చేవి. ఈ వాటర్‌షెడ్ కట్టడంతో దిగువన పొలాల్లో 300 నుంచి 400 అడుగుల లోపున బోరు తవ్విస్తే చాలు నీళ్లు పడుతున్నాయి. వాటర్‌షెడ్ పథకంలో రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నారు. ఈ వాటర్‌షెడ్ పనులతో మా గ్రామం పచ్చగా మారనుంది.

- బుడ్డన్న, సర్పంచ్, దుబ్బిగానిపల్లె పంచాయతీ, మదనపల్లె మండలం

### రెండేళ్లలో పనులు పూర్తి చేయించాం



వాటర్‌షెడ్ కమిటీలోని 11 మంది సభ్యులతో నిత్యం టచ్‌లో ఉంటూ ఎక్కడెక్కడ పనులు చేస్తే ఫలితాలు వస్తాయో గుర్తించాము. రెండేళ్ల క్రితం చేపట్టిన ఈ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాము. ఇందులో క్షేత్రస్థాయిలో పనులు చేపడుతూ విజయం సాధించాము. నాలుగేళ్లలో చేపట్టాల్సిన పనులను రెండేళ్లలో పూర్తి చేయడమే కాక, నీటి వనరుల నిల్వ చేయడంలో 100 శాతం ఫలితాలు సాధించాము.

- లక్ష్మీనరసయ్య, ఏపీడీ, జిల్లా వాటర్‌షెడ్ ప్రాజెక్టు



## అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



అర్జీదారుల సమస్యలు వింటున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి చిన్నమండెం పర్యటన సందర్భంగా వచ్చిన అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి అర్జీదారునితో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ భూములు రీసర్వే చేస్తున్న నేపథ్యంలో నా భూమిలో కొంత విస్తీర్ణం కొందరి ఖాతాల్లోకి మ్యుటేషన్ అయిందని, మా భూమి నాకు తిరిగి మ్యుటేషన్ చేయాలని వీరబల్లి మండలం సోమవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పుత్తావాండ్లపల్లెకు చెందిన ఎంపీ చిన్నకృష్ణారెడ్డి జేసీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మ్యాపింగ్ చేసే సమయంలో తప్పుగా వేరొక ప్రదేశంలో ఉన్నట్టు మ్యాపింగ్ చేశారని, దానిని సరిదిద్దాలని పెనగలూరు మండలానికి చెందిన అభినేని ప్రియస్వప్న జాయింట్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జీఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, డీపీవో రాధమ్మ, హౌసింగ్ పీడీ రమేశ్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చూపవద్దని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించిన జిల్లా ఎస్పీ వారి సమస్యలపై బాధితులతో ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఎస్పీ స్పష్టం చేశారు.

సీటీఎం క్రాస్‌లో మహిళ దారుణ హత్య

6

వైభవంగా లక్ష దీపోత్సవం

## 20న ప్రత్యేక విద్యుత్ అదాలత్

మదనపల్లె టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఫిర్యాదు చేసుకోవడానికి ఈనెల 20వ తేదీ ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ములకలచెరువు పట్టణంలోని ఎస్పీడీసీఎల్ సెక్షన్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమం రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

## సౌదీ బస్సు ప్రమాదంపై పలువురి నివాళి

రాయచోటి (నేతాజీసర్కిల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో జరిగిన బస్సు ప్రమాదంపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉమ్రా యాత్రలో భాగంగా మక్కా నుంచి మదీనా వెళుతున్న భారతీయ యాత్రికుల బస్సు అగ్ని ప్రమాదానికి గురై అందులో ప్రయాణిస్తున్న 45 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఎమ్మెల్సీ జకియా ఖానం ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## భస్మాలంకారంలో అఘోర లింగేశ్వరుడు





వీరభద్రాలయంలో భస్మాలంకారంలో అఘోర లింగేశ్వరుడు, వీరభద్రాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాల్గవ సోమవారం సందర్భంగా రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీఅఘోరలింగేశ్వరుడు భస్మాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పూలదండలు, పట్టువస్త్రాలు, భస్మాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అఘోరలింగేశ్వరుడిని దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. అభిషేకాల అనంతరం అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ఇంటింటి సర్వే

● అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాధిక



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాధిక

రామాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాధిక అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఒంటిపై ఎర్రమచ్చలు, నల్లమచ్చలు, తెల్లమచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేసి నివేదికలను పంపించాలన్నారు. అనంతరం అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శుభ్రంగా చేతులు కడుక్కొని భోజనాలు చేయాలన్నారు. అంటువ్యాధులకు గురికాకుండా ముందు జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి దివ్యశ్రీ, లక్కిరెడ్డిపల్లె సబ్‌యూనిట్ అధికారి జయరామయ్య, సీహెచ్‌వో రేఖానాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# చిలగడ దుంప.. లాభాల గంప...

- తక్కువ ఖర్చు.. మంచి ఆదాయం
- సేంద్రియ ఎరువులు, డ్రిప్ పద్ధతిలో సాగు



కలకడ మండలంలో చిలగడ దుంపల పంట సాగు, చిలగడ దుంపలు

కలకడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-రబీ మధ్యస్థ సీజన్‌లో పండించే చిలగడ దుంపలు (గెన్సీ గడ్డల) సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కరువు ప్రాంతంలోని మెట్టభూములు, నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఫలితం అందుకుంటున్నారు. మండలంలోని సింగనొడ్డుపల్లె, గుడిబండ, తెట్టు, తిప్పిగారిపల్లె, మండ్యెంవారిపల్లె గ్రామాల రైతులు ఏటా దాదాపు 200 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు.

అదేవిధంగా గుర్రంకొండ, కలికిరి, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో కూడా పంట సాగు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. రైతు విత్తన తీగలను ముందుగానే సిద్ధం చేసుకుని సాగుకు వాడుతున్నారు. దుక్కుల నుంచి సేంద్రియ ఎరువులు, కూలీలు పంట నూర్పిడికి ఎకరాకు సుమారు రూ.45 వేలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఉన్న నీటి వనరుల పొదుపు కోసం డ్రిప్ పద్ధతితో తడులు సమకూరుస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, గత ఏడాది వీటి ధర టన్ను రూ.20 వేల నుంచి 25 వేల వరకు ధర పలికినట్లు తెలిపారు. ఈ వంతున పంట పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు రూ.70 వేలు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఈ పంటకు తెగుళ్ల తాకిడి లేకపోవడం తమకు కలిసొస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట నుంచి అందిన తీగలు పాడిఆవుల కడుపు నింపడానికి పనికొస్తోందని ధీమాగా ఉన్నారు.

### నికర ఆదాయం...



మాకు గెన్సీ గడ్డల సాగులో నికర ఆదాయం వస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఈ సేద్యం చేస్తున్నాం. పంట సాగుకు పెట్టిన పెట్టుబడికి ఎటువంటి ఢోకా ఉండదు. ఈ పంట వేసి నష్టపోయిన దాఖలాలు లేవు.

- బి.మహేశ్వరరెడ్డి, సింగనొడ్డుపల్లి, కలకడ మండలం

### ఎకరా భూమిలో సాగు చేశా...



ఎకరం భూమిలో సాగు చేశా
ఈ ఏడాది ఎకరం భూమిలో గెన్సీ గడ్డల పంట సాగు చేశా. మాది కరువు ప్రాంతం ఇతర పంటలు సాగు చేస్తే ఫలితం వస్తుందని గ్యారెంటీ లేదు. అందుకు తక్కువ ఖర్చుతో సాగై పంటలపై దృష్టి సాధించాం. ఇందుకు తక్కువ పెట్టుబడి పంటగా గెన్సీ గడ్డల పంటను సాగు చేస్తున్నాం. ఏటా సాగులో లాభాలను గడిస్తున్నాం.

- ఆర్.వీరాంజులు, తెట్టు గ్రామం, కలకడ, మండలం

### మార్కెటింగ్ అవకాశాలు...

రైతులు పండించిన సరుకును వ్యాపారులు పొలం వద్దే కొనుగోలు చేస్తారు. మొదటి విడతగా జనవరిలో వచ్చే సరుకును వారు కొనుగోలు చేసి చెన్నై, హైదరాబాదు, విజయవాడ తదితర మార్కెట్‌లకు తరలిస్తారు. అదేవిధంగా రెండో విడతగా మార్చి, ఫిబ్రవరిలో వచ్చే సరుకును ఢిల్లీ, కోల్‌కతా, తదితర ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు, ఉత్తరాది రాష్ట్రాల్లో మహాశివరాత్రి పర్వదినం రోజు దేవుడికి నైవేద్య సమర్పణకు, వంటకాలకు గెన్సీ గడ్డలను విరివిగా ఉపయోగిస్తారు. అందువల్ల ఆ సమయంలో వీటికి గిరాకీ ఎక్కువగా ఉంటుందని మార్కెట్‌లో సరుకు బాగా అమ్ముడుపోతుందని వ్యాపారులు తెలిపారు. ఈ పంట వేసిన రైతు ఇంతవరకు నష్టపోయిన దాఖలాలు లేవని చెబుతున్నారు.

## పరిశ్రమలు వస్తేనే కోడూరు అభివృద్ధి

### టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్



మాట్లాడుతున్న పంతగాని

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు వస్తేనే కోడూరు అభివృద్ధి సాధ్యం అవుతుందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ విశాఖలో సీఐఐ నిర్వహించిన సదస్సులో పెట్టుబడులు రాష్ట్రానికి వరదలా వచ్చాయని తెలిపారు. రైల్వేకోడూరుకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తీసుకుని రావాలని కోరారు. రైల్వేకోడూరులో బొప్పాయి, అరటి, మామిడి పంటలను రైతులు పండిస్తున్నారని, వీటి ఆధారితంగా పరిశ్రమలు వస్తే ఇటు రైతులు బాగుపడతారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో చాలా మంది వెళితే కువైత్‌కు లేదంటే కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, రాయలసీమను అభివృద్ధి చేయాలంటే పరిశ్రమలు రావాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం వచ్చే మార్గాలను చంద్రబాబు చూస్తున్నారని, 20 లక్షల ఉద్యోగాలను ఈ ప్రభుత్వంలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హక్కుల కోసం నిరంతర పోరాటం

### ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్



కోర్టు వద్ద న్యాయవాదులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశంలో అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా సోమవారం ఆయన అన్నమయ్య, కడప జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి పట్టణం లక్ష్మీపురంలోని కోర్టు వద్ద న్యాయవాదులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తోందని, న్యాయవాదులు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి బార్ కౌన్సిల్ సభ్యుడిగా మళ్లీ తనను గెలిపిస్తే న్యాయవాదుల హక్కుల కోసం మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, రామకొండయ్య, రాయచోటి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డిబాషా, ఉపాధ్యక్షుడు ధనుంజయ్‌కుమార్, ట్రెజరర్ ఆదిరెడ్డినాయక్, రాయచోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆటో, కారు ఢీ - రైతు మృతి



పెద్దరెడ్డెయ్య మృతదేహం

రామాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి బస్టాప్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొని కోటకొండ పెద్దరెడ్డెయ్య (57) అనే రైతు మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన రైతు కోటకొండ పెద్దరెడ్డెయ్య, కొందరు రైతులు రాయచోటి మార్కెట్‌కు కూరగాయలను ఆటోలో సోమవారం తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలోని బండపల్లి బస్టాప్ సమీపానికి వెళ్లగానే వెనుక వైపున శ్రీశైలం నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో కోటకొండ పెద్దరెడ్డెయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఢీకొన్న కారులో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడిని శవపరీక్ష నిమిత్తం బంధువులకు అప్పగించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

## ముగిసిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

### బాలికల విభాగంలో కడప, బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్ల విజయం



ప్రథమ స్థానంలో నిలిచిన కడప బాలికల జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం బాలుర జట్టు

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-19 విభాగంలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి చంద్రమోహన్‌రాజు మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో శ్రీకాకుళం మొదటి స్థానంలో, రెండో స్థానంలో కర్నూలు జట్టు నిలవగా, బాలికల విభాగంలో కడప జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో గుంటూరు జట్టు నిలిచిందన్నారు. రైల్వేకోడూరులో బేస్‌బాల్ పోటీలను అందరి సహకారంతో సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. పోటీల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడారని తెలిపారు. భోజన, వసతుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశామని తెలిపారు. శ్రీకాకుళం-కర్నూలు, కడప-గుంటూరు జట్ల మధ్య ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో రైల్వేకోడూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోదర, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, ఏపీ బేస్‌బాల్ టోర్నమెంట్ పరిశీలకుడు దాదాపీర్, విశ్రాంత వ్యాయామ సంచాలకులు సుబ్బరాజు, చమర్తి శారద, విజయప్రసాద్ రెడ్డి, కడప జిల్లా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

## భార్య వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మల్లికార్జున

నిమ్మనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు తాళలేక ఓ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లికు చెందిన మల్లికార్జునను అతడి భార్య మంజుల ప్రతిరోజూ వేధింపులకు గురిచేసేది. ఇటీవల మంజుల పుట్టింటికి వెళ్లి రామసముద్రం పోలీసుస్టేషన్‌లో తన భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు పెట్టినట్లు తెలిపారు. అంతటితో ఆగకుండా నాలుగురోజుల తర్వాత పుట్టింటి నుంచి వచ్చిన మంజుల భర్తను ఇంటిలోకి రానివ్వలేదని తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన మల్లికార్జున ఇంటిలో ఉన్న విషద్రావణం తాగగా గమనించిన కుటుంబీకులు వెంటనే మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## లెక్కల్లో లేని ఎరువుల విక్రయాలు నిలిపివేత



ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీలత

కలికిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన రికార్డులు లేకుండా నిల్వ ఉంచిన ఎరువులను విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిలుపుదల చేశారు. రాయచోటి రెగ్యులర్ ఏడీఏ కె.శ్రీలత ఆధ్వర్యంలో స్థానిక ఎరువుల దుకాణాలలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

తనిఖీల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, గోడౌన్‌లలోని నిల్వలను బేరీజు వేశారు. ఫారం 'ఓ'లో నమోదు చేయకుండా అమ్మకాలకు పెట్టిన రూ.58,780 విలువైన నిల్వలను విక్రయించకుండా నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో ఈ నిల్వలను 'ఓ' ఫారంలో నమోదు చేయకుంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల ఏవో ఎం.హేమలత, ఏఈవో ఇంద్ర పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు మేరకు ఆక్రమణలు తొలగిస్తాం

- సబ్ కలెక్టర్ భావన



సబ్‌కలెక్టర్ భావనతో మాట్లాడుతున్న కృష్ణానగర్ వాసులు

రాజంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు మేరకు కృష్ణానగర్‌లో ఆక్రమణలు తొలగిస్తామని సబ్ కలెక్టర్ భావన తెలిపారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో కృష్ణానగర్ వాసులు సబ్‌కలెక్టర్‌ను కలిసి హైకోర్టు తీర్పును అందజేశారు.

వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ కూచివారిపల్లె గ్రామ పంచాయతీ రాజంపేట తహసీల్దారు, డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్, సర్వేయర్లకు నిబంధనల మేరకు రహదారిని చూపి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాజంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి కమలాదేవికి కూడా హైకోర్టు తీర్పు కాపీని అందజేశారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగిస్తామని హైకోర్టు తీర్పును అమలు చేస్తామని పంచాయతీ కార్యదర్శి కృష్ణానగర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

సిద్దవటం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగంపల్లె గ్రామ సమీపం పెన్నానదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. షర్టు తెలుపురంగుపైన ఆకుపచ్చ, నశ్యం కలర్ రంగు, నిలువు గీతలు కలిగి వయస్సు సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ఆ వ్యక్తి చనిపోయి సుమారు 10-15 రోజులు అయి ఉంటుందని, జిల్లా పోలీసుస్టేషన్‌లో ఏదైనా మిస్సింగ్ కేసులు నమోదై వుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్‌ఐ 9121100584, సీఐ 9121100581 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## సీటీఎం క్రాస్‌లో మహిళ దారుణ హత్య

- మెడకు టవల్ బిగించి చంపిన దుండగులు



హత్యకు గురైన మహిళ



సావిత్రమ్మ (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ పంచాయతీలో మహిళ దారుణ హత్యకు గురైంది. తాలుకా సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సీటీఎం క్రాస్ పాకాలవీధిలో నివాసం ఉంటున్న అర్జునరావు భార్య సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ (45) ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో బహిర్భూమికని వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయాన్నే సచివాలయ సమీపంలో బీడు భూమిలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. ఆమె కూలి పనులు చేసుకొంటూ జీవిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు విషయాన్ని తెలిపారు. వెంటనే డీఎస్పీ సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హత్యగా నిర్ధారించారు. సావిత్రమ్మ గొంతుకు టవల్ చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారన్నారు. సంఘటన స్థలంలో పోలీసులు, క్లూ టీం జాగిలాలతో పరీక్షించారు. అవి సంఘటన స్థలం నుంచి పాకాలవీధి వరకు వెళ్లి అగిపోయాయని తెలిపారు. వెంటనే మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఆమెకు కుమార్తె కవిత, కుమారుడు ఆదిత్య ఉన్నట్లు చెప్పారు. హత్య జరిగినప్పటి నుంచి సావిత్రమ్మ కుమారుడు, కుటుంబసభ్యులు ఇంటికి తాళంవేసి ఎక్కడికో వెళ్లడంతో స్థానికులు వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తమ్ముడు సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ హత్య కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పాఠశాలకు రూ.2 లక్షల ఆర్థికసాయం



భూమి పూజలో బ్యాంకు మేనేజర్, తదితరులు

రాజంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల బాత్‌రూం నిర్మాణానికి కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రూ.2 లక్షలు ఆర్థిక సహకారం అందించారు.

ఈ సందర్భంగా సోమవారం బ్యాంకు మేనేజర్ ఆకుల సుబ్బరాయుడు, బీజేపీ నాయకుడు తోట శ్రీనివాస్‌ధీరజ్, బిల్డర్ నాగేశ్వరరాజులు పాఠశాలలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాక పాఠశాలకు రూ.2 లక్షలు సహకారం అందించిన కెనరా బ్యాంకు ఏజీఎం అరుణజ్యోతికి ఉపాధ్యాయులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్ధరాత్రి దొంగల బెడద

### పోలీసులకు చింతపర్తి బీసీ కాలనీ వాసుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బీసీ కాలనీ వాసులు

వాల్మీకిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం బీసీ కాలనీలో పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి వరుసగా ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడిన సంఘటన మరువకముందే మళ్లీ అదే బీసీ కాలనీ ప్రాంతంలో అర్ధరాత్రి దొంగల బెడద స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. సోమవారం సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో బీసీ కాలనీ, చింతపర్తి గ్రామానికి చెందిన మహిళలు వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఐదురోజుల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట సమయాన గుర్తుతెలియని వ్యక్తులు కాలనీ ప్రాంతంలో సంచరిస్తున్నారని, తలుపులు కొడుతూ బెదిరిస్తున్నారని, బిగ్గరగా కేకలు పెట్టేలోపు ఉడాయిస్తున్నారని వాపోయారు.

రాత్రి సమయాలలో ఇళ్లలో ఉండాలన్నా నిద్రపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నల్ల దుస్తులు ధరించి పాదరక్షలు లేకుండా చడీచప్పుడు కాకుండా బీసీ కాలనీ ప్రాంతంలో దుండగులు తిరుగుతున్నారని వివరించారు. దీనిపై ఎస్‌ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇకపై రాత్రి గస్తీలు కూడా ముమ్మరం చేస్తామని కాలనీ వాసులు అధైర్య పడొద్దన్నారు. కాలనీ ప్రాంతంలో ఇంటి యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. అలాగే ఏ సమయంలోనైనా మళ్లీ గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తక్షణమే సమాచారం అందిస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

## అంగరంగ వైభవంగా లక్ష దీపోత్సవం

బి.కొత్తకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా బి.కొత్తకోటలో లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణానికి చెందిన శ్రీమహావిష్ణుసేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను వేదికపై ఆసీనులను చేసి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణవేడుకను నిర్వహించారు. వేదాంతగీత శివం ఫౌండేషన్ అధ్యక్షుడు పరమహంస పరివ్రాజకాచార్యులు పూజ్యపాద ఆచార్య అభినవశంకరానందస్వామి హైందవధర్మంపై చేసిన ప్రవచనాలు భక్తులను ఆలోచింపజేశాయి. అనంతరం అఖండజ్యోతిని వెలిగించి లక్షదీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. బి.కొత్తకోట పట్టణంలోంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చి దీపోత్సవం పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పీటీఎం రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్ నుంచి జ్యోతిసర్కిల్ వరకు టేబుళ్లపై అమర్చిన లక్షదీపాలు వెలిగించిన అనంతరం దీపాల వెలుగును చూసి జనం పరవశించారు. ఈ సందర్భంగా కేరళవాయిద్యాలు ఆకట్టుకున్నాయి.



శివపార్వతుల కల్యాణం

కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



# వెదురు సాగు... ప్రోత్సాహకాలు బాగు



పోరుమామిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ బ్యాంబు మిషన్ పథకం ద్వారా వెదురు సాగు ప్రోత్సహిస్తున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోరుమామిళ్ల ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో వెదురు నరకడానికి అటవీశాఖ అనుమతి తప్పక తీసుకోవాల్సి ఉండేదని, అయితే 2017లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో రైతులు తమ వ్యవసాయ భూముల్లో వెదురు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా...

**వెదురు సాగు... ప్రయోజనాలు**

వెదురు నాటిన నాలుగు సంవత్సరాల నుంచి కోతకు వస్తుందని, వెదురు సాగుతో ఎకరాకు సంవత్సరానికి రూ.2లక్షల నుంచి 3 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. బంజరు భూముల నుంచి సాగుకు అనుకూలమైన అన్ని నెలల్లో ఇది సాగు చేసుకోవచ్చు. అంతకాకుండా తక్కువ నీటి లభ్యత ఉన్న నేలలో సాగు చేసేందుకు అనువైన పంట అని, పొలం గట్లపైన సరిహద్దు పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. నేలకోతను అరికట్టడంలో సహాయపడుతుంది.

**వాణిజ్య సరళిలో రకాలు...**

సాగు సౌలభ్యం, వాతావరణ అనుకూలత, మార్కెట్ డిమాండ్‌ను బట్టి వాణిజ్య పరమైన సాగుకు మల్కోవా డెండ్ర కళామస్, అప్సర, బాంబుసా, బీమావంటి రకాలు అనుకూలంగా ఉంటాయి. ఇవి త్వరగా పెరగడంతో పాటు నాణ్యమైన కలప అందుతుంది. నేలను బాగా దున్ని మొక్కల మధ్యలో 5 ఇంటు 5 మీటర్లు దూరం ఉండేలా చూసుకుని గుంతలు తవ్వాలి. తేమతో కూడిన నేల అనుకూలం. బిందు సేద్యం పద్ధతిని పాటిస్తే మంచిది. నాటిన 3,4 సంవత్సరాల్లోనే పంట కోతకు వస్తుంది. సుమారు 40 సంవత్సరాల పైబడి దిగుబడి ఇస్తుంది.

**ప్రభుత్వ మద్దతు... రాయితీ వివరాలు**



వెదురు మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి

నేషనల్ బాంబ్యుమిషన్ కింద మొక్కలు నాటడానికి నర్సరీల ఏర్పాటుకు.. రైతు శిక్షణ కేంద్రాల్లో రైతులకు సాగు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహణకు, విజ్ఞాన యాత్రలకు ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. రైతులు వెదురును పొలం నాటుకోవడానికి హెక్టారుకు 2 దఫాలుగా 60వేలు రాయితీ అందిస్తుంది. పొలంలో సరిహద్దు పంటగా నాటినా ఈ రాయితీ పొందవవచ్చు. ఒక రైతుకు దాదాపు పదిహెక్టార్ల వరకు రాయితీ ఉంటుంది. వెదురు వివిధ పంటల్లో ఊత కర్రగా, ఫర్నీచర్, నిర్మాణ పనులు, చేతివృత్తులు, కాగితం తయారీ వంటి వివిధ పరిశ్రమల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. పూర్తి వివరాలకు 79950 86977 సంప్రదించాలన్నారు.

# రూ.14.10 కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నుంచి రూ.14.10 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక వైద్యాధికారులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆస్పత్రి విస్తరణ, పాత మరుగుదొడ్ల పునర్నిర్మాణం, రోగుల సౌకర్యాల మెరుగుదల, పరిశోధన విభాగాల ఏర్పాటు చేయనున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో వేధిస్తున్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు పూర్తిస్థాయిలో నియామకాలు చేపడతామన్నారు. అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందన్నారు. అనంతరం దాతల సహకారంతో సేకరించిన వీల్‌చైర్స్, స్ట్రెచర్లు, బెడ్‌షీట్స్‌ను ఆస్పత్రి వర్గాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమశ్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఆర్ఎంవో డాక్టర్ శివరాం, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలి శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, రాష్ట్ర వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్‌హుస్సేన్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్‌ముక్తియార్, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో యువకుడి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రమణ

పులివెందుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రమణ తెలిపారు. సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లింగాల మండలానికి చెందిన ఓ బాలిక పులివెందులలో చదువుతుండేది. పులివెందులలోని బాకరాపురం వీధిలో నివాసముండే షేక్ ఇమ్రాన్ ఆ బాలికను ప్రేమించమని వెంటపడేవాడు. ఇందుకు బాలిక తిరస్కరించి, తన తండ్రికి చెప్పింది. దీంతో ఆ యువకుడిని బాలిక తండ్రి గట్టిగా మందలించాడు. ఇది మనుసులో పెట్టుకున్న ఇమ్రాన్ నవంబరు 7వ తేదీ ఇంట్లో ఉన్న బాలికను కిడ్నాప్ చేసి కారులో అనంతపురం తీసుకెళ్లాడు. అక్కడ ఊరి బయట ఉన్న జగనన్నకాలనీలోని ఓ రూములో ఉంచి శారీరకంగా అనుభవించాడు. ఈనెల 14వ తేదీ ఆ బాలిక ఇమ్రాన్ నుంచి తప్పించుకొని వచ్చి లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ పులి వెందుల-పార్నపల్లె మెయిన్‌రోడ్డు తాతిరెడ్డిపల్లె క్రాస్ వద్ద అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు.

# జనవరిలో కడపలో ఇస్తేమా : మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూక్

కడప కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఏడాది జనవరి 23 నుంచి 25 వరకు రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమం నిర్వహించనున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి నమాజ్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, జేసి అదితిసింగ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, కడప ఎమ్మెల్యే మాదవిరెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇస్తేమా కార్యక్రమాన్ని ఈ సారి కడప జిల్లాలో నిర్వహిస్తామన్నారు. జనవరి నెలలో మూడు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కమిటీ సభ్యులు, అధికారులు విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలన్నారు. రోడ్ మ్యాప్, తాగు నీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బారికేడ్లు తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ఇస్తేమా కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జన వరిలో 3 రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఇస్తేమా కార్య క్రమానికి పక్కా ప్రణాళికతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్ప టికే వివిధ శాఖల అధికారులకు మౌలిక వసతుల కల్పనలు వివిధ రకాల విధులు నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇస్తేమా కార్యక్రమాన్ని కొప్పర్తిలోని ఏపీఐఐసీ ప్రాంతాన్ని గుర్తించామన్నారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పా టు దేశ వ్యాప్తంగా మైనార్టీ ముస్లిం పెద్దలు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# దత్తత పోస్టరు ఆవిష్కరణ




పోస్టరును ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దత్తత కార్యక్రమం పోస్టరును సోమవారం జేసీ అతిథిసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అనాథలు, అభాగ్యులైన పిల్లలను దత్తత ద్వారా పిల్లలు లేని వారు పొందవచ్చని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవితో పాటు ఆశాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం





గ్రామోత్సవానికి బయల్దేరిన అయ్యప్పస్వామి, దీపాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఖాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి 9వ గ్రామోత్సవం కార్తీక 4వ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అయ్యప్పస్వామికి మహిళలు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ భక్తుల సహకారంతో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 12 గంటల వరకు కోలాటాల మధ్య భారీగా బాణసంచా పేల్చుతూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కన్యస్వాములు కలశాలతో, మహిళలు దీపాలతో స్వామివారికి స్వాగతం పలికారు. ఈసంద ర్భంగా మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించిన లడ్డూను బీసీ కాలనీకి చెందిన రవికుమార్ (చిన్న) రూ.59 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు.

# వేంపల్లెలో పలుచోట్ల చోరీలు



చోరీ జరిగిన రెడీమేడ్ షోరూంను పరిశీలిస్తున్న డీఎస్పీ

వేంపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని కందుల కాంప్లెక్స్‌లో ఉన్న తేజ రెడీమేడ్‌షోరూంలో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి దుకాణంలోకి వెళ్లిన దొంగలు రూ.6వేల నగదు, పట్టుచీరలు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అలాగే జడ్పీ కాంప్లెక్స్‌లో ఉన్న లక్కీ హెయిర్ సెలూన్‌లో ఉన్న డిజిటల్ టీవీని దొంగతనం చేశారు. చోరీ జరిగిన ప్రాంతాలను పులివెందుల డీఎస్పీ మురళినాయక్, సీఐ నరసింహులు, పోలీసు సిబ్బంది పరిశీలించి చుట్టుపక్కలవారిని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



కొండాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగుమంచిపల్లెలోని కాశిలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. ఉదయం 6.30 నుంచి 7.00 గంటల వరకు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకినట్లు గ్రామస్థులు తెలిపారు. పవిత్ర కార్తీక సోమవారం నాడు సూర్యకిరణాలు పరమశివుని తాక డంతో భక్తులు పులకించిపోయారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ఈ దృశ్యాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

## జయమ్మ కుటుంబానికి
# రూ.5 లక్షలు ఆర్థిక సాయం



వెంకట్రామయ్యకు చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటూరు గ్రామ పంచాయతీ భాకరాపురం గ్రామానికి చెందిన అంబవత్తుల జయమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జయమ్మ మరణించగా, ఆమెకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో అదే గ్రామానికి చెందిన మండల టీడీపీ యువత అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో మంచి జరిగిందని తెలిపారు. ఆమె భర్త వెంకట రాయయ్య పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ప్రతి నెలా రూ.15వేలు పింఛను అందే విధంగా ఎమ్మెల్యే మంజూరు చేయించారని తెలిపారు. లేబాక నాగేశ్వరరెడ్డి, నాగసు బ్బారెడ్డి కలిసి జయమ్మ కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేశారు.

# వైవీయూ బయోకెమిస్ట్రి స్కాలర్ నవీన్‌కు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ స్కాలర్ పి.నవీన్‌కు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. పి.నవీన్ ఆశాఖ ఆచార్యులు పి.రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో ప్రినటల్ ఎక్స్పోజర్ ఆఫ్ జస్టోరెటిక్ ఆన్ మేల్ అండ్ ఫిమేల్ రెప్రొడక్టివ్ హెల్త్ ఇన్ విస్టర్ ర్యాట్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. వైస్ చాన్సలర్ మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు అలానే వైవావోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా నవీన్ థీసిస్ డాక్టరేట్‌నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేర కు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెస ర్ కెఎస్‌వీ కృష్ణారావు స్కాలర్ పి.నవీన్‌కు పీహెచ్‌డీ నోటి ఫికేషన్‌ను ప్రకటించారు. నవీన్ రాసిన పరిశోధన పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందు కున్న సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు.

# పంటలను కప్పేసిన గడ్డి



వర్షాలకు మినుము పంటపై అల్లుకుపోయిన గడ్డి

రాజుపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెలరోజులకు పైగా ఎడ తెరిపి లేకుండా వర్షాలు పడడంతో లోతట్టుగా ఉన్న భూముల్లో సాగైన మినుము, మిరప, జొన్న పంటల్లో విపరీతంగా గడ్డి మొలిచింది. దీనికితోడు పంటలన్నీ ఎర్రగా పోతుండడంతో రైతులు గత్యంతరం లేక గడ్డిమందు పిచికారి చేస్తున్నారు. రెండో పంట సాగుకు అయినా అనుకూలంగా ఉంటుందని వేలాది రూపాయలు ఖర్చు గడ్డిమందు కొట్టి పంటను చంపేస్తున్నారు. దీంతో సాగు చేసిన పంట నష్టాలతో పాటు రెండో పంట సాగుకు మరింత ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో దాదాపు రూ.2వేల నుంచి రూ.3వేల ఎకరాల్లో పంటలకు రైతులు చేసేది లేక గడ్డిమందు కొట్టి నాశనం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందిస్తే రెండో పంట సాగు చేస్తామని అంటున్నారు.

# ఆస్తులు తీసుకుని తల్లిదండ్రులను వదిలేస్తే చర్యలు

- జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదన్‌రావు

కమలాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నుంచి ఆస్తులు తీసుకుని అనాథలుగా వదిలేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం కమలాపురం ఎమ్మార్వో ఆఫీసు ప్రాంగణంలో మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం-2007పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పెద్దల్ని గౌరవించే లా ఉండేదని, కాలక్రమేణా కుటుంబాలు విడిపోతుండడంతో కొన్ని కుటుం బాల్లో పెద్దలు నిర్లక్ష్యానికి గురవుతున్న పరిస్థితులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ప్రభుత్వం పెద్దలను రక్షించేందుకు ప్రత్యే కంగా 2007 చట్టాన్ని ప్రవేశపెట్టింద న్నారు. పిల్లలు ఆస్తి తీసుకున్న తరు వాత తల్లిదండ్రులను చూసుకోకపోతే ఆ ఆస్తి బదిలీని కోర్టు మోసపూరితంగా పరిగణిస్తుందని, తల్లిదండ్రులు కేసు వేసి ఆ ఆస్తిని తిరిగి పొందే పూర్తి హక్కు కలిగి ఉంటారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి బి.ఉదయ్‌కిరణ్, న్యాయవాదులు న్యాయవాది మహేశ్వర్‌రెడ్డి, వెంకటశివ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# కైలాసనాథ.. శంభో శంకరా...

భక్తులతో పోటెత్తిన శివాలయాలు ● చివరి సోమవారం కావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు





చిట్వేలి: ప్రత్యేక అలంకారంలో శ్యామలాంబదేవి, సిద్దవటం: నిత్యపూజకోనలో గుండాల్లో స్నానమాచరిస్తున్న భక్తులు, రైల్వేకోడూరు: పుష్పయాగం చేస్తున్న విశ్వేశ్వరనాయుడు దంపతులు

సిద్దవటం/రైల్వేకోడూరు/రాజంపేట/చిట్వేలి/ఒంటిమిట్ట/లక్కిరెడ్డిపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపర్థీశ్వరకోన భక్తులతో పోటెత్తింది. భక్తుల రద్దీ పెరగడంతో శివపార్వతుల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో వేచి వున్నారు. వచ్చిన భక్తులకు కడప నారాయణరెడ్డి కుటుంబీకులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కడప - చెన్నై జాతీయ రహదారి పక్కన వెలసిన నీలకంఠేశ్వరాలయంలో దర్శనానికి బారులుతీరారు. నిత్యపూజకోన భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, గ్రామ సర్పంచ్ ఓబులయ్య, భక్తులు పాల్గొన్నారు.

అలాగే రైల్వేకోడూరు పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగం నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు రకాల పూలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్నా, అర్చకులు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, దూర్జటి యోగి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. రాజంపేట పట్టణంలోని శివాలయంలో కార్తీక నాలుగో సోమవారం సందర్భంగా పర్వతవర్ధినిదేవి సమేత రామలింగేశ్వర స్వామి శివరూప అలంకారంలో, పార్వతిదేవి పర్వతవర్ధినిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పూజారులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు 365 వత్తులతో కార్తీక దీపాలు వెలిగించారు.

చిట్వేలి శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో ఉదయం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుండాలకోన కర్మటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

ఒంటిమిట్ట సమీపంలోని మృకుండాశ్రమంలో హరినామ స్మరణలతో మారుమోగింది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో ఆలయం భక్తులతో నిండిపోయింది. అలాగే ఒంటిమిట్ట చెరువు కట్టపై ఉన్న శివాలయం, ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఉన్న శివాలయం కూడా భక్తులతో కిటకిటలాడింది.

లక్కిరెడ్డిపల్లెలో కార్తీక మాసం పురష్కరించుకొని శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. లక్కిరెడ్డిపల్లెలోని సర్వమంగళాదేవి, రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వాముల వారికి రుద్రాభిషేకం, పాలాభిషేకం నిర్వహించి ఘనంగా పూజలు నిర్వహించారు.

## ఘనంగా పడిమెట్ల పూజ

ఓబులవారిపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ చలంపాలెంలో రవిస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పడిమెట్ల పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. 18 కలిశాలు ఏర్పాటు చేసి అయ్యప్ప స్వామి ప్రతిమకు బంగారు ఆభరణాలు ధరింపజేసి దూప దీప నైవేద్యాలతో పాటు పూలు, పాల పంచామృతాభిషేకాలు చేశారు. కాగా ఏనుగుల రవిరాజు ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సుభద్రమ్మ, వినయ్‌కుమార్, శంకర్‌రాజు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.









## భారతీయులు మృతిచెందడం బాధాకరం

సిద్దవటం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సౌది అరేబియా దేశం మదీనా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతీయులు 42 మంది మృతిచెందడం బాధాకరమని వైసీపీ జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి పెంచలయ్య అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని తెలిపారు.

## ప్రారంభమైన శిక్షణ తరగతులు

చిట్వేలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిట్వేలి ఎమ్మార్సీలో టీచ్ టూల్ లెవల్-2 శిక్షణ తరగతులు ప్రారంభమైనట్లు ఎంఈవో-1 ఖాజామొహిద్దీన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రీసోర్స్‌పర్సన్‌గా హరినాథ్, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం చంద్ర, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పుల్లంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ బేస్‌బాల్ పోటీలకు పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థిని శ్రీ హర్షిత ఎంపికైంది. ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు కడపలో జరిగిన ఎస్‌జీఎఫ్ 19 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో కడప జిల్లా జట్టు రాష్ట్రస్థాయి విజేతగా నిలిచింది. ఆ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నీలకంఠరావు తెలిపారు. హర్షితను, పీడీ నీలకంఠరావును ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఒకే యాప్ అమలు చేయాలి

● ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐ సొసైటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్(నాన్ వొకేషన్) ఉద్యోగులు ఒకే యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే ఏపీ నివాస్ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేస్తుండగా, ఉదయం 9.15 లోపు ఫేషియల్ యాప్ ద్వారా కూడా హాజరు నమోదు చేయాలంటూ బలవంతం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, రవిప్రకాశ్, రామ్మూర్తినాయక్, పద్మనాభుడు, తదితరులు పాల్గొన్నారు.

## 'పార్టీ బలోపేతానికి కమిటీ సిద్ధం'

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి గ్రామ, మండల కమిటీలను సిద్ధం చేద్దామని రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఎంకేఆర్ కల్యాణ మండపంలో పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబు, టీడీపీ నాయకులు రవినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

## సమావేశం వాయిదా

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరగాల్సి వుండగా, కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేశామని సంబేపల్లె ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. సమావేశం ఎప్పుడు జరిగేది తెలియజేస్తామన్నారు.

## పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

రైల్వేకోడూరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భోళాశంకర్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులను సోమవారం అందించారు. రంగనాయకులపేటకు చెందిన కొర్లకుంట సిద్ధమ్మ, పాతబజారుకు చెందిన చంద్రశేఖర్‌లకు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా నిరుపేదలకు నిత్యావసరాలను పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సీహెచ్ రమేష్‌బాబు, వాసా బాబు, పి.రాజేశ్వరమ్మ, రత్తయ్య, టి.ఆంజనేయులు, శంకరయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కమిటీకి పీవీ రమణ ఎన్నిక



రాజంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు వేదికగా నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కమిటీకి పీవీ రమణను ఎన్నుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలో సీఎం చంద్రబాబు మున్సిపల్ కార్మికులకు రెగ్యులర్ చేస్తానని చెప్పి హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పట్టణాల్లో జనాభా పెరుగుదలకు తగ్గట్టు కార్మికులను భర్తీ చేస్తామని తెలిపారని వారు పేర్కొన్నారు. అలాగే కొన్ని హామీలను కూడా నెరవేరుస్తామని తెలిపారన్నారు. అనంతరం రాష్ట్ర కమిటిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రైల్వేకోడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే పీజీఆర్‌ఎస్ లక్ష్యమని తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం రెవెన్యూశాఖ కార్యాలయంలో ప్రజా సమస్యల ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగృహాలు, ఇంటి స్థలాలు, భూ సర్వే సమస్యలు, గ్రామాల్లో మౌలికమైన వసతులు తదితర వాటిపై వినతులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## మాతృత్వం ఒక వరం : ఐసీడీఎస్

రైల్వేకోడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మాతృత్వం ఒక వరం, దత్తత అందుకు మరో మార్గం అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారిణి పి.రామలక్ష్మీ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు గౌరీ శంకర్ విద్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన, అంతర్జాతీయ దత్తత మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలోనే వివాహాలు చేసుకుంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సుందర్‌బాబు, కరస్పాండెంట్ అదునుకోట గోపీనాథ్, లత పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



నిత్యాన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న రూపానందగిరిస్వామి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తిరుపతి వశిష్ఠ ఆశ్రమం లలితా పీఠాధిపతి వ్యవస్థాపకుడు రూపానందగిరి స్వామి పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని శ్రీమాతాంగ గిరినంద స్వామి ఆశ్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, వాసుదేవుడు పాల్గొన్నారు.

## రైల్వేకోడూరు సీఐగా చంద్రశేఖర్



రైల్వేకోడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు అర్బన్ సీఐగా చంద్రశేఖర్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు డీసీఆర్‌బీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం, పేకాట, వ్యభిచారం, వైట్ కాలర్ నేరాలు, కోడి పందేలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు.

## ఒంటిమిట్ట సీఐగా నరసింహరాజు



ఒంటిమిట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సీఐగా పి.నరసింహరాజు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక సీఐ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు వీఆర్ నుంచి ఒంటిమిట్టకు బదిలీపై వచ్చారు. అనంతరం స్థానిక కోదండరామాలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఇక్కడ సీఐగా పనిచేసిన బాబు అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు.

## ఈవోపీఆర్డీగా శ్రీలత



ఒంటిమిట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల ఈవోపీఆర్డీగా శ్రీలత బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె యర్రగుంట్ల మండలం చిలంకూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ పదోన్నతిపై ఒంటిమిట్టకు విచ్చేశారు. ముందుగా ఇక్కడ పనిచేసిన ఈవోపీఆర్డీ ప్రసాద్ పదోన్నతిపై నందలూరు ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

## బస్సును పునరుద్ధరించండి

నందలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వేస్టేషన్ నుంచి రాజంపేట రైల్వేస్టేషన్ వైపు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు సాధారణ ప్రజలు రోజు ప్రయాణించే ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవిలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నందలూరు, రాజంపేట మధ్య నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేయడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాచూరి మురళి, వీరబల్లె జయకుమార్‌రెడ్డి, టీడీపీ ముస్లిం, మైనార్టీ నాయకుడు పఠాన్ మెహర్ ఖాన్, హ్యూమన్‌రైట్స్ ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ డేవిడ్, కళ్యాణిరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దారుపై ఫిర్యాదు

ఒంటిమిట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట తహసీల్దారుపై ఆర్డీవోకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ అక్కిలక్ష్మీదేవి తెలిపారు. సోమవారం హౌసింగ్ డీకేటీ పట్టా, గోకులం షెడ్లు, సన్నకారు రైతుల సర్టిఫికెటు పలు విషయాలపై చర్చించేందుకు తాను ఫోన్ చేసినా స్పందించలేదని, చివరికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిని పంపినా.. ఎంపీపీనే ఇక్కడికి రావాలని తహసీల్దార్ చెప్పారన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రికి కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు దామోదర్‌రెడ్డిని వివరణ కోరగా.. తాను ప్రజా పరిష్కార వేదికలో బిజీగా ఉండడం వల్ల వెళ్లలేకపోయానని తెలిపారు.

## మిట్స్ సీనియర్ ఏడీకి డాక్టరేట్ ప్రదానం



మారుతీ ప్రసాద్

కురబలకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను చాన్స్‌లర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రోచాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, వీసీ యువరాజ్ తదితరులు అభినందించారు.

## ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి: ఎస్ఐ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రామాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గువ్వలచెరువులో వాహనదారులకు సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే వాహనదారులు లైసెన్సుతో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శివ, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## రాయచోటి- పింఛా రోడ్డును బాగు చేయాలి

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటిటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాయచోటి- పింఛా ప్రధాన రహదారిని బాగు చేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాయచోటి-పింఛా రహదారి సమస్యపై కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అల్లాబకాష్, మన్సూర్ అలీ ఖాన్, అమీర్, దర్బార్‌బాషా జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

● ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్

ఓబులవారిపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో కొర్లకుంట గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ ఎం.రాజానాయక్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నిండిన చెరువులు, కుంటలు గుర్తించండి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల వ్యాప్తంగా ఎన్ని చెరువులు, కుంటలు నిండాయో గుర్తించాలని ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ ఏఈ, ఉపాధి హామీ ఏపీవో, నీటి సంఘం అధ్యక్షుడు, ఈవోపీఆర్‌డీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు ఎన్ని నిండాయి. నిండని చెరువులు ఎన్ని, ఎన్ని 80 శాతం లోపు నిండిన చెరువులు ఉన్నాయో గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సురేశ్, ఏపీవో రెడ్డిజవహర్, ఇరిగేషన్ ఏఈ శివనాయక్, శెట్టిపల్లి పెద్దచెరువు నీటి సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, పంచాయతీ సెక్రటరీ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

**లక్కిరెడ్డిపల్లె:** మండలంలో గతంలో నిర్మించిన చెరువులు, కుంటలు, కాలువలు, కల్వర్టులను గుర్తించి నివేదికలు కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. సోమవారం మండలంలోని అనంతపురం, చౌటపల్లి, కస్తూరిరాజుగారిపల్లె, కుర్నూతల గ్రామాల్లోని చెరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ బాషా, ఎన్‌ఆర్‌జీఎస్ జేఈ అరుణ్ బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేస్తా : దారపునేని

సిద్దవటం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం దేశానికి వెన్నుముకలాంటిదని, రైతులకు న్యాయం చేస్తానని సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథనాయుడు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని కోఆపరేటివ్ బ్యాంకు ప్రాంగణంలో సోమవారం సింగిల్‌విండో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి జగన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం సింగిల్‌విండో డైరెక్టర్లు సాంబశివారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కోఆపరేటివ్ బ్యాంకు సీఈవో సుకుమార్, కోఆపరేటివ్ సబ్‌డివిజన్ అధికారి శ్రీధర్, మేనేజర్, నవీన్‌కుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# చిలగడ దుంప.. లాభాల గంప...

- తక్కువ ఖర్చు.. మంచి ఆదాయం
- సేంద్రియ ఎరువులు, డ్రిప్ పద్ధతిలో సాగు



కలకడ మండలంలో చిలగడ దుంపల పంట సాగు, చిలగడ దుంపలు

కలకడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-రబీ మధ్యస్థ సీజన్‌లో పండించే చిలగడ దుంపలు (గెన్సీ గడ్డల) సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కరువు ప్రాంతంలోని మెట్టభూములు, నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఫలితం అందుకుంటున్నారు. మండలంలోని సింగనొడ్డుపల్లె, గుడిబండ, తెట్టు, తిప్పిగారిపల్లె, మండ్యెంవారిపల్లె గ్రామాల రైతులు ఏటా దాదాపు 200 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు.

అదేవిధంగా గుర్రంకొండ, కలికిరి, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో కూడా పంట సాగు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. రైతు విత్తన తీగలను ముందుగానే సిద్ధం చేసుకుని సాగుకు వాడుతున్నారు. దుక్కుల నుంచి సేంద్రియ ఎరువులు, కూలీలు పంట నూర్పిడికి ఎకరాకు సుమారు రూ.45 వేలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఉన్న నీటి వనరుల పొదుపు కోసం డ్రిప్ పద్ధతితో తడులు సమకూరుస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని, గత ఏడాది వీటి ధర టన్ను రూ.20 వేల నుంచి 25 వేల వరకు ధర పలికినట్లు తెలిపారు. ఈ వంతున పంట పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు రూ.70 వేలు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఈ పంటకు తెగుళ్ల తాకిడి లేకపోవడం తమకు కలిసొస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట నుంచి అందిన తీగలు పాడిఆవుల కడుపు నింపడానికి పనికొస్తోందని ధీమాగా ఉన్నారు.

### నికర ఆదాయం...



మాకు గెన్సీ గడ్డల సాగులో నికర ఆదాయం వస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఈ సేద్యం చేస్తున్నాం. పంట సాగుకు పెట్టిన పెట్టుబడికి ఎటువంటి ఢోకా ఉండదు. ఈ పంట వేసి నష్టపోయిన దాఖలాలు లేవు.

- బి.మహేశ్వరరెడ్డి, సింగనొడ్డుపల్లి, కలకడ మండలం

### ఎకరా భూమిలో సాగు చేశా...



ఎకరం భూమిలో సాగు చేశా
ఈ ఏడాది ఎకరం భూమిలో గెన్సీ గడ్డల పంట సాగు చేశా. మాది కరువు ప్రాంతం ఇతర పంటలు సాగు చేస్తే ఫలితం వస్తుందని గ్యారెంటీ లేదు. అందుకు తక్కువ ఖర్చుతో సాగై పంటలపై దృష్టి సాధించాం. ఇందుకు తక్కువ పెట్టుబడి పంటగా గెన్సీ గడ్డల పంటను సాగు చేస్తున్నాం. ఏటా సాగులో లాభాలను గడిస్తున్నాం.

- ఆర్.వీరాంజులు, తెట్టు గ్రామం, కలకడ, మండలం

### మార్కెటింగ్ అవకాశాలు...

రైతులు పండించిన సరుకును వ్యాపారులు పొలం వద్దే కొనుగోలు చేస్తారు. మొదటి విడతగా జనవరిలో వచ్చే సరుకును వారు కొనుగోలు చేసి చెన్నై, హైదరాబాదు, విజయవాడ తదితర మార్కెట్‌లకు తరలిస్తారు. అదేవిధంగా రెండో విడతగా మార్చి, ఫిబ్రవరిలో వచ్చే సరుకును ఢిల్లీ, కోల్‌కతా, తదితర ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు, ఉత్తరాది రాష్ట్రాల్లో మహాశివరాత్రి పర్వదినం రోజు దేవుడికి నైవేద్య సమర్పణకు, వంటకాలకు గెన్సీ గడ్డలను విరివిగా ఉపయోగిస్తారు. అందువల్ల ఆ సమయంలో వీటికి గిరాకీ ఎక్కువగా ఉంటుందని మార్కెట్‌లో సరుకు బాగా అమ్ముడుపోతుందని వ్యాపారులు తెలిపారు. ఈ పంట వేసిన రైతు ఇంతవరకు నష్టపోయిన దాఖలాలు లేవని చెబుతున్నారు.

## పరిశ్రమలు వస్తేనే కోడూరు అభివృద్ధి

**టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు నరసింహప్రసాద్**



మాట్లాడుతున్న పంతగాని

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు వస్తేనే కోడూరు అభివృద్ధి సాధ్యం అవుతుందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ విశాఖలో సీఐఐ నిర్వహించిన సదస్సులో పెట్టుబడులు రాష్ట్రానికి వరదలా వచ్చాయని తెలిపారు. రైల్వేకోడూరుకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తీసుకుని రావాలని కోరారు. రైల్వేకోడూరులో బొప్పాయి, అరటి, మామిడి పంటలను రైతులు పండిస్తున్నారని, వీటి ఆధారితంగా పరిశ్రమలు వస్తే ఇటు రైతులు బాగుపడతారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో చాలా మంది వెళితే కువైత్‌కు లేదంటే కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, రాయలసీమను అభివృద్ధి చేయాలంటే పరిశ్రమలు రావాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం వచ్చే మార్గాలను చంద్రబాబు చూస్తున్నారని, 20 లక్షల ఉద్యోగాలను ఈ ప్రభుత్వంలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హక్కుల కోసం నిరంతర పోరాటం

**ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్**



కోర్టు వద్ద న్యాయవాదులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, దేశంలో అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల సందర్భంగా సోమవారం ఆయన అన్నమయ్య, కడప జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటి పట్టణం లక్ష్మీపురంలోని కోర్టు వద్ద న్యాయవాదులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తోందని, న్యాయవాదులు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి బార్ కౌన్సిల్ సభ్యుడిగా మళ్లీ తనను గెలిపిస్తే న్యాయవాదుల హక్కుల కోసం మరింతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిటైర్డ్ జడ్జి ఇస్మాయిల్, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, రామకొండయ్య, రాయచోటి బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డిబాషా, ఉపాధ్యక్షుడు ధనుంజయ్‌కుమార్, ట్రెజరర్ ఆది రెడ్డినాయక్, రాయచోటి న్యాయవాదులు పాల్గొన్నారు.

## లెక్కల్లో లేని ఎరువుల విక్రయాలు నిలిపివేత



ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీలత

కలికిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరైన రికార్డులు లేకుండా నిల్వ ఉంచిన ఎరువులను విక్రయించకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిలుపుదల చేశారు. రాయచోటి రెగ్యులర్ ఏడీఏ కె.శ్రీలత ఆధ్వర్యంలో స్థానిక ఎరువుల దుకాణాలలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

తనిఖీల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, గోడౌన్‌లలోని నిల్వలను బేరీజు వేశారు. ఫారం 'ఓ'లో నమోదు చేయకుండా అమ్మకాలకు పెట్టిన రూ.58,780 విలువైన నిల్వలను విక్రయించకుండా నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో ఈ నిల్వలను 'ఓ' ఫారంలో నమోదు చేయకుంటే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల ఏవో ఎం.హేమలత, ఏఈవో ఇంద్ర పాల్గొన్నారు.

## అర్ధరాత్రి దొంగల బెడద

**పోలీసులకు చింతపర్తి బీసీ కాలనీ వాసుల ఫిర్యాదు**



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బీసీ కాలనీ వాసులు

వాల్మీకిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపర్తి గ్రామం బీసీ కాలనీలో పది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి వరుసగా ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడిన సంఘటన మరువకముందే మళ్లీ అదే బీసీ కాలనీ ప్రాంతంలో అర్ధరాత్రి దొంగల బెడద స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. సోమవారం సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో బీసీ కాలనీ, చింతపర్తి గ్రామానికి చెందిన మహిళలు వాల్మీకిపురం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఐదురోజుల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట సమయాన గుర్తుతెలియని వ్యక్తులు కాలనీ ప్రాంతంలో సంచరిస్తున్నారని, తలుపులు కొడుతూ బెదిరిస్తున్నారని, బిగ్గరగా కేకలు పెట్టేలోపు ఉడాయిస్తున్నారని వాపోయారు.

రాత్రి సమయాలలో ఇళ్లలో ఉండాలన్నా నిద్రపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నల్ల దుస్తులు ధరించి పాదరక్షలు లేకుండా చడీచప్పుడు కాకుండా బీసీ కాలనీ ప్రాంతంలో దుండగులు తిరుగుతున్నారని వివరించారు. దీనిపై ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇకపై రాత్రి గస్తీలు కూడా ముమ్మరం చేస్తామని కాలనీ వాసులు అధైర్య పడొద్దన్నారు. కాలనీ ప్రాంతంలో ఇంటి యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. అలాగే ఏ సమయంలోనైనా మళ్లీ గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తక్షణమే సమాచారం అందిస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆటో, కారు ఢీ - రైతు మృతి



పెద్దరెడ్డెయ్య మృతదేహం

రామాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి బస్టాప్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొని కోటకొండ పెద్దరెడ్డెయ్య (57) అనే రైతు మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకు చెందిన రైతు కోటకొండ పెద్దరెడ్డెయ్య, కొందరు రైతులు రాయచోటి మార్కెట్‌కు కూరగాయలను ఆటోలో సోమవారం తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలోని బండపల్లి బస్టాప్ సమీపానికి వెళ్లగానే వెనుక వైపున శ్రీశైలం నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో కోటకొండ పెద్దరెడ్డెయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఢీకొన్న కారులో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడిని శవపరీక్ష నిమిత్తం బంధువులకు అప్పగించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు.

## భార్య వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మల్లికార్జున

నిమ్మనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు తాళలేక ఓ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లికు చెందిన మల్లికార్జునను అతడి భార్య మంజుల ప్రతిరోజూ వేధింపులకు గురిచేసేది. ఇటీవల మంజుల పుట్టింటికి వెళ్లి రామసముద్రం పోలీసుస్టేషన్‌లో తన భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపుల కేసు పెట్టినట్లు తెలిపారు. అంతటితో ఆగకుండా నాలుగురోజుల తర్వాత పుట్టింటి నుంచి వచ్చిన మంజుల భర్తను ఇంటిలోకి రానివ్వలేదని తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన మల్లికార్జున ఇంటిలో ఉన్న విషద్రావణం తాగగా గమనించిన కుటుంబీకులు వెంటనే మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

సిద్దవటం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగంపల్లె గ్రామ సమీపం పెన్నానదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. షర్టు తెలుపురంగుపైన ఆకుపచ్చ, నశ్యం కలర్ రంగు, నిలువు గీతలు కలిగి వయస్సు సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ఆ వ్యక్తి చనిపోయి సుమారు 10-15 రోజులు అయి ఉంటుందని, జిల్లా పోలీసుస్టేషన్‌లో ఏదైనా మిస్సింగ్ కేసులు నమోదై వుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ 9121100584, సీఐ 9121100581 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## పాఠశాలకు రూ.2 లక్షల ఆర్థికసాయం



భూమి పూజలో బ్యాంకు మేనేజర్, తదితరులు

రాజంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల బాత్‌రూం నిర్మాణానికి కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రూ.2 లక్షలు ఆర్థిక సహకారం అందించారు.

ఈ సందర్భంగా సోమవారం బ్యాంకు మేనేజర్ ఆకుల సుబ్బరాయుడు, బీజేపీ నాయకుడు తోట శ్రీనివాస్‌ధీరజ్, బిల్డర్ నాగేశ్వరరాజులు పాఠశాలలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాక పాఠశాలకు రూ.2 లక్షలు సహకారం అందించిన కెనరా బ్యాంకు ఏజీఎం అరుణజ్యోతికి ఉపాధ్యాయులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

**బాలికల విభాగంలో కడప, బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్ల విజయం**



ప్రథమ స్థానంలో నిలిచిన కడప బాలికల జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం బాలుర జట్టు

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-19 విభాగంలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా కడప జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి చంద్రమోహన్‌రాజు మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో శ్రీకాకుళం మొదటి స్థానంలో, రెండో స్థానంలో కర్నూలు జట్టు నిలవగా, బాలికల విభాగంలో కడప జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో గుంటూరు జట్టు నిలిచిందన్నారు. రైల్వేకోడూరులో బేస్‌బాల్ పోటీలను అందరి సహకారంతో సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. పోటీల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడారని తెలిపారు. భోజన, వసతుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశామని తెలిపారు. శ్రీకాకుళం-కర్నూలు, కడప-గుంటూరు జట్ల మధ్య ఫైనల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో రైల్వేకోడూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోదర, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, ఏపీ బేస్‌బాల్ టోర్నమెంట్ పరిశీలకుడు దాదాపీర్, విశ్రాంత వ్యాయామ సంచాలకులు సుబ్బరాజు, చమర్తి శారద, విజయప్రసాద్ రెడ్డి, కడప జిల్లా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు మేరకు ఆక్రమణలు తొలగిస్తాం

- సబ్ కలెక్టర్ భావన



సబ్‌కలెక్టర్ భావనతో మాట్లాడుతున్న కృష్ణానగర్ వాసులు

రాజంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు మేరకు కృష్ణానగర్‌లో ఆక్రమణలు తొలగిస్తామని సబ్ కలెక్టర్ భావన తెలిపారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో కృష్ణానగర్ వాసులు సబ్‌కలెక్టర్‌ను కలిసి హైకోర్టు తీర్పును అందజేశారు.

వెంటనే స్పందించిన సబ్‌కలెక్టర్ కూచివారిపల్లె గ్రామ పంచాయతీ రాజంపేట తహసీల్దారు, డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్, సర్వేయర్లకు నిబంధనల మేరకు రహదారిని చూపి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాజంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి కమలాదేవికి కూడా హైకోర్టు తీర్పు కాపీని అందజేశారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగిస్తామని హైకోర్టు తీర్పును అమలు చేస్తామని పంచాయతీ కార్యదర్శి కృష్ణానగర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

## సీటీఎం క్రాస్‌లో మహిళ దారుణ హత్య

- మెడకు టవల్ బిగించి చంపిన దుండగులు



హత్యకు గురైన మహిళ



సావిత్రమ్మ (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ పంచాయతీలో మహిళ దారుణ హత్యకు గురైంది. తాలుకా సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సీటీఎం క్రాస్ పాకాలవీధిలో నివాసం ఉంటున్న అర్జునరావు భార్య సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ (45) ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో బహిర్భూమికని వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం ఉదయాన్నే సచివాలయ సమీపంలో బీడు భూమిలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. ఆమె కూలి పనులు చేసుకొంటూ జీవిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మదనపల్లె డీఎస్పీ మహేంద్రకు విషయాన్ని తెలిపారు. వెంటనే డీఎస్పీ సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హత్యగా నిర్ధారించారు. సావిత్రమ్మ గొంతుకు టవల్ చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారన్నారు. సంఘటన స్థలంలో పోలీసులు, క్లూ టీం జాగిలాలతో పరీక్షించారు. అవి సంఘటన స్థలం నుంచి పాకాలవీధి వరకు వెళ్లి ఆగిపోయాయని తెలిపారు. వెంటనే మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఆమెకు కుమార్తె కవిత, కుమారుడు ఆదిత్య ఉన్నట్లు చెప్పారు. హత్య జరిగినప్పటి నుంచి సావిత్రమ్మ కుమారుడు, కుటుంబసభ్యులు ఇంటికి తాళంవేసి ఎక్కడికో వెళ్లడంతో స్థానికులు వారిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తమ్ముడు సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ హత్య కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అంగరంగ వైభవంగా లక్ష దీపోత్సవం

కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు





శివపార్వతుల కల్యాణం

బి.కొత్తకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా బి.కొత్తకోటలో లక్ష దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణానికి చెందిన శ్రీమహావిష్ణుసేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను వేదికపై ఆశీనులను చేసి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణవేడుకను నిర్వహించారు. వేదాంతగీత శివం ఫౌండేషన్ అధ్యక్షుడు పరమహంస పరివ్రాజకాచార్యులు పూజ్యపాద ఆచార్య అభినవశంకరానందస్వామి హైందవధర్మంపై చేసిన ప్రవచనాలు భక్తులను ఆలోచింపజేశాయి. అనంతరం అఖండజ్యోతిని వెలిగించి లక్షదీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. బి.కొత్తకోట పట్టణంలోంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చి దీపోత్సవం పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పీటీఎం రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి సర్కిల్ నుంచి జ్యోతిసర్కిల్ వరకు టేబుళ్లపై అమర్చిన లక్షదీపాలు వెలిగించిన అనంతరం దీపాల వెలుగును చూసి జనం పరవశించారు. ఈ సందర్భంగా కేరళవాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

# వెదురు సాగు... ప్రోత్సాహకాలు బాగు



పోరుమామిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ బ్యాంబు మిషన్ పథకం ద్వారా వెదురు సాగు ప్రోత్సహిస్తున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోరుమామిళ్ల ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో వెదురు నరకడానికి అటవీశాఖ అనుమతి తప్పక తీసుకోవాల్సి ఉండేదని, అయితే 2017లో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో రైతులు తమ వ్యవసాయ భూముల్లో వెదురు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా...

**వెదురు సాగు... ప్రయోజనాలు**

వెదురు నాటిన నాలుగు సంవత్సరాల నుంచి కోతకు వస్తుందని, వెదురు సాగుతో ఎకరాకు సంవత్సరానికి రూ.2లక్షల నుంచి 3 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. బంజరు భూముల నుంచి సాగుకు అనుకూలమైన అన్ని నెలల్లో ఇది సాగు చేసుకోవచ్చు. అంతకాకుండా తక్కువ నీటి లభ్యత ఉన్న నేలలో సాగు చేసేందుకు అనువైన పంట అని, పొలం గట్లపైన సరిహద్దు పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. నేలకోతను అరికట్టడంలో సహాయపడుతుంది.

**వాణిజ్య సరళిలో రకాలు...**

సాగు సౌలభ్యం, వాతావరణ అనుకూలత, మార్కెట్ డిమాండ్‌ను బట్టి వాణిజ్య పరమైన సాగుకు మల్కోవా డెండ్ర కళామస్, అప్సర, బాంబుసా, బీమావంటి రకాలు అనుకూలంగా ఉంటాయి. ఇవి త్వరగా పెరగడంతో పాటు నాణ్యమైన కలప అందుతుంది. నేలను బాగా దున్ని మొక్కల మధ్యలో 5 ఇంటు 5 మీటర్ల దూరం ఉండేలా చూసుకుని గుంతలు తవ్వాలి. తేమతో కూడిన నేల అనుకూలం. బిందు సేద్యం పద్ధతిని పాటిస్తే మంచిది. నాటిన 3,4 సంవత్సరాల్లోనే పంట కోతకు వస్తుంది. సుమారు 40 సంవత్సరాల పైబడి దిగుబడి ఇస్తుంది.

**ప్రభుత్వ మద్దతు... రాయితీ వివరాలు**

నేషనల్ బాంబ్యుమిషన్ కింద మొక్కలు నాటడానికి నర్సరీల ఏర్పాటుకు.. రైతు శిక్షణకేంద్రాల్లో రైతులకు సాగు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహణకు, విజ్ఞాన యాత్రలకు ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. రైతులు వెదురును పొలం నాటుకోవడానికి హెక్టారుకు 2 దఫాలుగా 60వేలు రాయితీ అందిస్తుంది. పొలంలో సరిహద్దు పంటగా నాటినా ఈ రాయితీ పొందవవచ్చు. ఒక రైతుకు దాదాపు పదిహెక్టార్ల వరకు రాయితీ ఉంటుంది. వెదురు వివిధ పంటల్లో ఊత కర్రగా, ఫర్నీచర్, నిర్మాణ పనులు, చేతివృత్తులు, కాగితం తయారీ వంటి వివిధ పరిశ్రమల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. పూర్తి వివరాలకు 79950 86977 సంప్రదించాలన్నారు.



వెదురు మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి

# దత్తత పోస్టరు ఆవిష్కరణ



పోస్టరును ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దత్తత కార్యక్రమం పోస్టరును సోమవారం జేసీ అతిథిసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అనాధలు, అభాగ్యులైన పిల్లలను దత్తత ద్వారా పిల్లలు లేని వారు పొందవచ్చని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవితో పాటు ఆశాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పోక్సో కేసులో యువకుడి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ రమణ

పులివెందుల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రమణ తెలిపారు. సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లింగాల మండలానికి చెందిన ఓ బాలిక పులివెందులలో చదువుతుండేది. పులివెందులలోని బాకరాపురం వీధిలో నివాసముండే షేక్ ఇమ్రాన్ ఆ బాలికను ప్రేమించమని వెంటపడేవాడు. ఇందుకు బాలిక తిరస్కరించి, తన తండ్రికి చెప్పింది. దీంతో ఆ యువకుడిని బాలిక తండ్రి గట్టిగా మందలించాడు. ఇది మనుసులో పెట్టుకున్న ఇమ్రాన్ నవంబరు 7వ తేదీ ఇంట్లో ఉన్న బాలికను కిడ్నాప్ చేసి కారులో అనంతపురం తీసుకెళ్లాడు. అక్కడ ఊరి బయట ఉన్న జగనన్నకాలనీలోని ఓ రూములో ఉంచి శారీరకంగా అనుభవించాడు. ఈనెల 14వ తేదీ ఆ బాలిక ఇమ్రాన్ నుంచి తప్పించుకొని వచ్చి లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ పులి వెందుల- పార్నపల్లె మెయిన్‌రోడ్డు తాతిరెడ్డిపల్లె క్రాస్ వద్ద అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు.

# జనవరిలో కడపలో ఇస్తేమా : మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూక్

కడప కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే ఏడాది జనవరి 23 నుంచి 25 వరకు రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమం నిర్వహించనున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి నమాజ్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, జేసి అదితిసింగ్, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, కడప ఎమ్మెల్యే మాదవిరెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇస్తేమా కార్యక్రమాన్ని ఈ సారి కడప జిల్లాలో నిర్వహిస్తామన్నారు. జనవరి నెలలో మూడు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కమిటీ సభ్యులు, అధికారులు విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలన్నారు. రోడ్ మ్యాపు, తాగు నీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ, బారికేడ్లు తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ఇస్తేమా కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జన వరిలో 3 రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఇస్తేమా కార్య క్రమానికి పక్కా ప్రణాళికతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్ప టికే వివిధ శాఖల అధికారులకు మౌలిక వసతుల కల్పనలు వివిధ రకాల విధులు నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇస్తేమా కార్యక్రమాన్ని కొప్పర్తిలోని ఏపీఐఐసీ ప్రాంతాన్ని గుర్తించామన్నారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పా టు దేశ వ్యాప్తంగా మైనార్టీ ముస్లిం పెద్దలు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవానికి బయల్దేరిన అయ్యప్పస్వామి, దీపాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఖాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి 9వ గ్రామోత్సవం కార్తీక 4వ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అయ్యప్పస్వామికి మహిళలు, స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ భక్తుల సహకారంతో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 12 గంటల వరకు కోలాటాల మధ్య భారీగా బాణసంచా పేల్చుతూ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కన్యస్వాములు కలశాలతో, మహిళలు దీపాలతో స్వామివారికి స్వాగతం పలికారు. ఈసంద ర్భంగా మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించిన లడ్డూను బీసీ కాలనీకి చెందిన రవికుమార్ (చిన్న) రూ.59 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు.

# వేంపల్లెలో పలుచోట్ల చోరీలు



చోరీ జరిగిన రెడీమేడ్ షోరూంను పరిశీలిస్తున్న డీఎస్పీ

వేంపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప-పులివెందుల ప్రధాన రహదారిలోని కందుల కాంప్లెక్స్‌లో ఉన్న తేజ రెడీమేడ్‌షోరూంలో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి దుకాణంలోకి వెళ్లిన దొంగలు రూ.6వేల నగదు, పట్టుచీరలు తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అలాగే జడ్పీ కాంప్లెక్స్‌లో ఉన్న లక్కీ హెయిర్ సెలూన్‌లో ఉన్న డిజిటల్ టీవీని దొంగతనం చేశారు. చోరీ జరిగిన ప్రాంతాలను పులివెందుల డీఎస్పీ మురళినాయక్, సీఐ నరసింహులు, పోలీసు సిబ్బంది పరిశీలించి చుట్టుపక్కలవారిని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



కొండాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సుగు మంచి పల్లెలోని కాశిలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సూర్యకిరణాలు శివలింగాన్ని తాకాయి. ఉదయం 6.30 నుంచి 7.00 గంటల వరకు సూర్యకిరణాలు శివలింగాన్ని తాకినట్లు గ్రామస్థులు తెలిపారు. పవిత్ర కార్తీక సోమవారం నాడు సూర్యకిరణాలు పరమశివుని తాక డంతో భక్తులు పులకించిపోయారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, ఈ దృశ్యాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

# జయమ్మ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం



వెంకట్రామయ్యకు చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటూరు గ్రామ పంచాయతీ భాకరాపురం గ్రామానికి చెందిన అంబవత్తుల జయమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల జయమ్మ మరణించగా, ఆమెకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో అదే గ్రామానికి చెందిన మండల టీడీపీ యువత అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో మంచి జరిగిందని తెలిపారు. ఆమె భర్త వెంకట రాయయ్య పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయ నకు ప్రతి నెలా రూ.15వేలు పింఛను అందే విధంగా ఎమ్మెల్యే మంజూరు చేయించారని తెలిపారు. లేబాక నాగేశ్వరరెడ్డి, నాగసు బ్బారెడ్డి కలిసి జయమ్మ కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేశారు.

# వైవీయూ బయోకెమిస్ట్రి స్కాలర్ నవీన్‌కు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ స్కాలర్ పి.నవీన్‌కు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. పి.నవీన్ ఆశాఖ ఆచార్యులు పి.రామచంద్రా రెడ్డి పర్యవేక్షణలో ప్రినటెల్ ఎక్స్‌పోజర్ ఆఫ్ జస్టోరెటిక్ ఆన్ మేల్ అండ్ ఫీమేల్ రెప్రొడెక్టివ్ హెల్త్ ఇన్ విస్టర్ ర్యాట్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. వైస్ చాన్సలర్ మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు అలానే వైవావోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా నవీన్ థీసిస్ డాక్టరేట్‌నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేర కు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెస ర్ కెఎస్‌వీ కృష్ణారావు స్కాలర్ పి.నవీన్‌కు పీహెచ్‌డీ నోటి ఫికేషన్‌ను ప్రకటించారు. నవీన్ రాసిన పరిశోధన పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందు కున్న సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు.

# పంటలను కప్పేసిన గడ్డి



వర్షాలకు మినుము పంటపై అల్లుకుపోయిన గడ్డి

రాజుపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెలరోజులకు పైగా ఎడ తెరిపి లేకుండా వర్షాలు పడడంతో లోతట్టుగా ఉన్న భూముల్లో సాగైన మినుము, మిరప, జొన్న పంటల్లో విపరీతంగా గడ్డి మొలిచింది. దీనికితోడు పంటలన్నీ ఎర్రగా పోతుండడంతో రైతులు గత్యంతరం లేక గడ్డిమందు పిచికారి చేస్తున్నారు. రెండో పంట సాగుకు అయినా అనుకూలంగా ఉంటుందని వేలాది రూపాయలు ఖర్చు గడ్డిమందు కొట్టి పంటను చంపేస్తున్నారు. దీంతో సాగు చేసిన పంట నష్టాలతో పాటు రెండో పంట సాగుకు మరింత ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో దాదాపు రూ.2వేల నుంచి రూ.3వేల ఎకరాల్లో పంటలకు రైతులు చేసేది లేక గడ్డిమందు కొట్టి నాశనం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందిస్తే రెండో పంట సాగు చేస్తామని అంటున్నారు.

# ఆస్తులు తీసుకుని తల్లిదండ్రులను వదిలేస్తే చర్యలు

● జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదన్‌రావు

కమలాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నుంచి ఆస్తులు తీసుకుని అనాథలుగా వదిలేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మధుసూదన్‌రావు తెలిపారు. సోమవారం కమలాపురం ఎమ్మార్వో ఆఫీసు ప్రాంగణంలో మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టం-2007పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పెద్దల్ని గౌరవించే లా ఉండేదని, కాలక్రమేణా కుటుంబాలు విడిపోతుండడంతో కొన్ని కుటుం బాల్లో పెద్దలు నిర్లక్ష్యానికి గురవుతున్న పరిస్థితులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ప్రభుత్వం పెద్దలను రక్షించేందుకు ప్రత్యే కంగా 2007 చట్టాన్ని ప్రవేశపెట్టింద న్నారు. పిల్లలు ఆస్తి తీసుకున్న తరు వాత తల్లిదండ్రులను చూసుకోకపోతే ఆ ఆస్తి బదిలీని కోర్టు మోసపూరితంగా పరిగణిస్తుందని, తల్లిదండ్రులు కేసు వేసి ఆ ఆస్తిని తిరిగి పొందే పూర్తి హక్కు కలిగి ఉంటారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సహాయ కార్యదర్శి బి.ఉదయ్‌కిరణ్, న్యాయవాదులు న్యాయవాది మహేశ్వర్‌రెడ్డి, వెంకటశివ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

నిమ్మనపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని ఏవో రమేశ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 నారాయణ, అంగన్వాడీ సూపర్‌వైజర్ కుసుమ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి వారిని సమీప పాఠశాలల్లో చేర్పించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## చదువుతోనే గుర్తింపు

మదనపల్లె టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చదువుతోనే మహిళలకు గుర్తింపు వస్తుందని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, కౌమార బాలికలకు ఆరోగ్యసూత్రాలు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సునీత, సూపర్‌వైజర్ శ్వేత, ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యసిబ్బంది, పోర్డు సంస్థ జలజ పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో రాణించాలి

వాల్మీకిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీవో నాగవేణి అన్నారు. రామసముద్రం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం మదనపల్లె ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లు, పోక్సో చట్టాలపై మహిళలకు ఎస్‌ఐ రమేశ్‌బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గఫూర్, ఏపీవో మాధవి, ఎంఈవో 2ఆంజనేయులు, హెచ్‌ఎం చిట్టిబాబు, మహిళా పోలీసులు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో ఎదగాలి

ములకలచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో భాగ్యమ్మ అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లను రక్షించి, కాపాడలన్నారు. బాల్యంలో వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరీమాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్సులు సమయానికి నడపాలి

మదనపల్లె అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హైర్ బస్సులు సమయానికి నడపాలని మదనపల్లె-1 డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక డిపో కార్యాలయంలో హైర్ బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైర్ బస్సులక టైర్లు, మెకానికల్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. బస్సులు ఆగు స్థలాల్లో, రిక్వెస్ట్ స్టేజీల్లో బస్సులను ఆపాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, హైర్ బస్సుల యజమానులు పాల్గొన్నారు.

## మాలమహానాడు రాష్ట్ర నూతన కమిటీ ఎంపిక

● రాష్ట్ర అధ్యక్షుడిగా యమలా



మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా సుదర్శనం

మదనపల్లె అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు రాష్ట్ర నూతన కమిటీని సోమవారం స్థానిక సీఎస్‌ఐ జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో ఎంపిక చేశారు. ఈ ఎంపిక రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ యమాల సుదర్శనం, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా గడ్డం నాగముని, ఉపాధ్యక్షులుగా లింగం సంజీవి, మాధురిమాధవ్, ఏఆర్ అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్వర్ణ వెంకయ్య, సహాయ కార్యదర్శులుగా కొప్పల రామచంద్ర, వీరేశ్, లింగంగుట్టు రామలింగం, రాష్ట్ర అధికారప్రతినిధిగా పూతలపట్టు ప్రభాకర్, కోశాధికారిగా హరి, మీడియా ప్రతినిధిగా వడిగల శేఖర్‌బాబు, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.



# భజే మంజునాథం.. శివం.. శివం

● భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు ● శివాలయాలకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో పీలేరు కాశీ విశ్వేశ్వరుడు



కేదారేశ్వర వ్రతానికి పీలేరు శివాలయానికి పోటెత్తిన భక్తులు

పీలేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పీలేరు మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కాశీవిశ్వేశ్వర స్వామి, శివరామపురంలోని భ్రమరాంబికాదేవి మల్లికార్జునస్వామి, అడవిపల్లెలోని మద్దుండాల మల్లేశ్వరస్వామి, జంగంపల్లెలోని వీరభద్రస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ జరిపి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహిళలు కేదారేశ్వర వ్రతం ఆచరించారు. సాయంత్రం ఆయా ఆలయాలు కార్తీకదీప కాంతులతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### భక్తిశ్రద్ధలతో నోముల వత్రం

కలకడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక నాల్గవ సోమవారం సందర్భంగా కలకడ సిద్ధేశ్వరాలయంలో నోముల వత్రాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌరమ్మకు పూజలు చేసి వత్ర విశిష్టతను విన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులతో ప్రాంగణం శివనామ స్మరణతో మార్మోగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం మహిళలు ఆలయం ఎదుట కార్తీక దీపాలు వెలిగించారు.

### ఘనంగా కుంభాభిషేకం

నిమ్మనపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాతంలో వెలసిన నేలమల్లేశ్వస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా కుంభాభిషేకం నిర్వహించినట్లు ఈవో మంజుల తెలిపారు. ఈ సందర్భంగా 101బిందెల బాహుదా నది జలాలతో స్వామివారిని శుద్ధి చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి కుంభాభిషేకానికి టీడీపీ రాష్ట్ర యువత అధ్యక్షుడు శ్రీరాంచినబాబు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్, సర్పంచ్ రెడ్డెప్ప, బాబురెడ్డి, మల్లప్ప, రాజన్న, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

### కార్తీక మాస విశేషపూజలు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముందుగా ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమంతో పాటు పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### మల్లయ్యకొండకు పోటెత్తిన భక్తులు

తంబళ్లపల్లె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండకు భక్తులు పోటెత్తారు. దీంతో కొండ భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు వచ్చి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అలాగే కొండపైన ఉన్న గౌరమ్మ అమ్మవారికి, ఏనుగు మల్లమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

### వైభవంగా కార్తీక మాస దీపోత్సవం

మదనపల్లె అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని పలు శివాలయాల్లో కార్తీక దీపోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. సీటీఎం రోడ్డులోని మంజునాథ ఆలయంలో, నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో, దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో, సీటీఎం గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, చిప్పిలి గ్రామంలోని (మడికయ్యల శివాలయం) యోగభోగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ముందుగా ఆలయాల్లో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.



మదనపల్లె: సీటీఎం రోడ్డులోని మంజునాథ ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కలకడలో నోములవ్రతంలో పాల్గొన్న మహిళలు

## ఇస్కాన్ సంస్థకు అప్పగించాలి



పాపేపల్లి నరసింహస్వామి దేవస్థానంలో గ్రామస్థులతో జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

పెద్దమండ్యం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన పాపేపల్లి నరసింహస్వామి దేవస్థానాన్ని ఇస్కాన్ సంస్థకు అప్పగించాలని పాపేపల్లి గ్రామస్థులు కోరారు. ఈమేరకు సోమవారం రాయచోటిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ విశాంత్‌కుమార్‌కు విన్నవించారు. స్వామివారికి నిత్య పూజలు, భక్తులకు సౌకర్యాలు, దేవస్థానం అభివృద్ధి సాధించడానికి ఇస్కాన్ సంస్థ ముందుకొచ్చినట్లు గ్రామ ప్రజలు వెల్లడించారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ సాయంత్రం పాపేపల్లి నరసింహస్వామి దేవస్థానాన్ని పరిశీలించారు. ప్రజల అభిప్రాయాలను కలెక్టర్‌కు నివేదికను పంపిస్తామని దేవదాయ ఈవో మునిరాజా వెల్లడించారు.

## ప్రజాప్రయోజన పనులు చేయాలి

పెద్దమండ్యం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రజాప్రయోజన పనులు చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో సురేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు సమావేశాలు జరపాలన్నారు. ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసం పెంచుకోవచ్చునని తెలిపారు. ఇంకుడు గంతలు, ఎరువుల నిల్వ గుంతలు తవ్వకోవాలని సూచించారు. పండ్ల తోటలు పెంచుకోవడానికి రైతులను పోత్సహించాలని, కూలీల సంఖ్య పెంచాలన్నారు. మస్టర్లలో పేర్లు, 7 బుక్స్, పనుల వివరాలను నమోదు చేయాలన్నారు. అలాగే పనుల వివరాల బోర్డులను ఆయా పనుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు... రామసముద్రం మండలం జక్కన్నవారిపల్లె గ్రామానికి చెందిన ఓ బాలిక (17) ఈనెల 15వ తేదీ రాత్రి 10.30గంటల సమయంలో ఇంటి నుండి కనిపించకుండా పోయింది. రెండు రోజులుగా బాలిక ఆచూకీ తెలియకపోవడంతో బాలిక తల్లి సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## 'గ్రంథాలయాలంటే గోడౌన్లు కాదు'

కలికిరి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలంటే పుస్తకాలను భద్రపరిచే గోడౌన్‌లు కాదని, విద్యార్థి దశ నుంచి జ్ఞాన సముపార్జనకు అవసరమైన వైజ్ఞానిక నిలయాలని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్నవారికే వాటి విలువ అర్థమవుతుందని వివరించారు. గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించి సాహితీ వేత్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి వేంపల్లె అబ్దుల్ ఖాదర్, కలికిరి ఎంఈవో నాగార్జున, చదుం ఇన్‌చార్జి ఎంఈవో నటరాజ, జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు మోహన్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు షాబుద్దీన్, రమేష్ బాబు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

వాల్మీకిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 6, 7 తరగతుల విద్యార్థులకు అరుణోదయ పబ్లిక్ వెల్‌ఫేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డిక్షనరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జాకబ్, పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ప్రభుకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

పీలేరు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వేగం పెంచాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన నిరుపేదలకు అందేలా చూడాలన్నారు. సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శానిటేషన్, తాగునీరు, వీధి దీపాలు, మురుగునీటి కాలువల నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లు తదితర కార్యక్రమాలపై కార్యదర్శుల పర్యవేక్షణ తప్పనిసరన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎం పీడీవో యుగంధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రకృతి కూరగాయల స్టాల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మండల సమాఖ్య కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి కూరగాయల స్టాళ్లు

వాల్మీకిపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ప్రకృతి కూరగాయల స్టాళ్లను సద్వినియోగం చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ సుబ్బరామయ్య తెలిపారు. ఎటువంటి రసాయనాలు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంలో దొరికే కషాయాలు, ద్రవ జీవామృతంతో పండించిన పంటలను రైతులు ఈ స్టాల్‌లో విక్రయిస్తున్నారని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, పెద్ద రెడ్డెయ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల అందజేత



ఉపకరణాలు అందిస్తున్న సమగ్రశిక్షణ సహిత విద్య జిల్లా అధికారులు

మదనపల్లె అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ-సమగ్రశిక్షణ సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందజేశారు. జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ జనార్ధన్, ఎంఈవో రాజగోపాల్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసి వారికి ఉచితంగా ఉపకరణాలు అందించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి మూడు వందల మంది పిల్లలు హాజరయ్యారన్నారు, కార్యక్రమంలో డాక్టర్లు శివశేషు పటనాయర్, శివప్రకాష్, ఐఈఎస్‌ఏ స్కూల్ అసిస్టెంటు టి.రామచంద్ర, భవిత ఐఈఆర్పీఎస్‌లు నాగేంద్ర, రెడ్డెమ్మ, ప్రసాద్, స్కూల్ ఇన్‌చార్జీ హెచ్‌ఎం భారతి, భవిత ఐఏ ఆర్పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మడికయ్యల శివాలయం చైర్మన్ సతీమణికి నివాళి

మదనపల్లె అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాయ చైర్మన్ కొప్పల వెంకటరమణ భార్య అమరావతి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. సోమవారం మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మహబూబ్ ఖాన్, శివాలయం డైరెక్టర్ వరప్రసాద్, జేసీ రెడ్డెప్ప, మల్లిక, బీజేపీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మదనపల్లె టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లిం మైనారిటిల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో ఇమామ్‌లు, మౌసన్‌లతో సమావేశం నిర్వహించారు. ముస్లిం సంక్షేమ పథకాలను విస్మరించకుండా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇమామ్‌లు, మౌసన్‌లకు ప్రతి నెలా పంపిణీ చేస్తున్న గౌరవ వేతనాలను రూ.90కోట్లు విడుదల చేసిందన్నారు.

## జంతర్‌మంతర్ వద్ద జిల్లా ఎమ్మార్పీఎస్ నేతలు



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు

పీలేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై గతంలో కోర్టు ఆవరణంలో జరిగిన దాడిని నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో జిల్లాకు చెందిన పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వారంతా ఢిల్లీ చేరుకుని ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కోట దానియల్, జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, కలకడ మండల అధ్యక్షుడు హరినాథ, వాల్మీకిపురం సంగీతం రవీశ్వర, కలికిరి అంజి, రామసముద్రం కొండప్ప, ఈశ్వర, తదితరులు ఆందోళనలో పాల్గొనగా వారిని మందకృష్ణ మాదిగ అభినందంచారు.

## శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



డీఏవో నిర్మలాదేవికి అర్జీ ఇస్తున్న దళితులు

మదనపల్లె టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కొత్తపల్లె దళితులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ డీఏవో నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ దండువారిపల్లె దళితులు మాట్లాడుతూ తమ గ్రామ దళితులు ఎవరైనా చనిపోతే చెరువులో తవ్వి అంత్యక్రియలు నిర్వహించేవారమని, ఇప్పుడు వర్షపు నీటితో చెరువు నిండిపోయిందని, దీంతో పూడ్చేందుకు కుంట స్థలం కూడా లేదని వాపోయారు. వీటితో పాటు భూసమస్యలు, భూములకు వన్-బీ, అడంగళ్ల రికార్డుల్లోకి ఎక్కించాలని, 22-ఏ జాబితాలో వున్న వాటిని తొలగించాలని, సర్వే సమస్యలు, పింఛన్ మంజూరు చేయాలని పలువురు డీఏవోకు అర్జీలు అందజేశారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు అరికెల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామసముద్రం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలలో అరికెల జడ్పీ హై స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ ఉదయ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యల్లారెడ్డి, 9వ తరగతి చదువుతున్న దీపిక చిత్తూరులో జరిగిన అండర్-17, 14 సాఫ్ట్‌బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 22నుండి వెస్ట్ గోదావరి, వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని పీడీ తెలిపారు.

## మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కి డాక్టరేట్ ప్రదానం



మారుతీప్రసాద్

కురబలకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను చాన్సలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రోచాన్సులర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, వీసీ యువరాజ్ తదితరులు అభినందించారు.

టీకేఎన్‌కు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి



## గృహప్రవేశంలో మంత్రి మండిపల్లి

మదనపల్లె టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ప్రముఖ వ్యాపారవేత్త టి.కృష్ణప్ప నాయుడు (టీకేఎన్) గృహప్రవేశ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె టీడీపీ నేత సీడ్ మల్లికార్జుననాయుడు, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, పురప్రముఖులు పాల్గొని టీకేఎన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

### పీలేరులో నల్లారి..

పీలేరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పీలేరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణస్వామి పూజల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీకాంత్ రెడ్డి, అనిత దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, నాయకులు కోటపల్లె బాబు, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, వగ్గల చిన్నా, రామకృష్ణారెడ్డి, శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, షౌకత్‌అలీ, స్పోర్ట్స్ మల్లి, రమాదేవి పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డి గృహప్రవేశంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

## పార్టీ కార్యాలయంపై దాడి అమానుషం

పీలేరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హిందూపూర్ వైసీపీ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. దాడిని ఖండిస్తూ సోమవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యయంలో ఒక పార్టీపై మరొకరు విమర్శలు చేసుకోవడం సహజమేనన్నారు. అయితే అధికారం ఉందన్న అహంతో రౌడీల్లా పార్టీ కార్యలయంపై పడి ధ్వంసం చేయడం తగదన్నారు. దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పీలేరు జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్, నాయకులు మూరే భువనేశ్వర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, లోకనాథరెడ్డి, జయరామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, తదితరులు